


ఆలయ ఆవరణలో, గలగలా గంతు లేస్తూ ఆడుకొంటున్న చిన్నారి పాపల్ని చూస్తూ కూచున్నాను, నేను. 'శివ_విష్ణు' ఆలయంలోని నవగ్రహాలని పదిరోజులుగా ప్రదక్షిణచేస్తున్న నేను, అక్కడి పరిసరాలకి చిరపరిచితురాలి నయ్యాను. మా చంటిపాప, సుమ, పుట్టి నప్పటినుండి నాకేదో నలతగావుంటోంది. నలభై రోజులు నవగ్రహ ప్రదక్షిణచేస్తే, నా ఆరోగ్యం కుదుటపడుతుందన్న ఆశతో - పక్కింటి మామ్మగారు చెప్పి నప్పటినుండి మొదలెట్టాను. "ఎవ్వరేది చెప్తే - అది ఆచరించడమేనా-?" అంటారు, శ్రీవారు. కానీ, కోవెల కారణంగానయినా కాస్తా కాలు కదిపినట్లుం టుందన్న ఉద్దేశ్యముతో, సాయంకాలాలు ఇలా బయలుదేరుతున్నాను.

ఆడుకుంటున్న పాపలలో, మా పెద్ద పాప స్వర్ణ కూడా వుంది. "చీకటిపడి పోయింది, ఇక వెళ్దామేస్వర్ణా-" అంటూ,

కేకేసాను. కానీ, నా చూపులుమాత్రం గుడి ముఖద్వారంవేపు త చ్చా డు తున్నాయ్. రోజూ నేను వచ్చిన కాస్సే పటికల్లా వచ్చి, నా వెంట వెంట తిరుగుతూ, నవగ్రహ ప్రదక్షిణచేసే ఆ పాప ఎందుకో ఇంకా రాలేదు. రోజూ, ఆ అమ్మాయితో ముచ్చటలాడటం అలవాటయిన నాకేంటో వెలితిగా వుంది. ఆ అమ్మాయితో - అదే పూర్ణిమతో - పరిచయమే, నాకు భలే గమ్మత్తుగా, ఆసక్తి దాయకంగా జరిగింది.

ఆరోజు నేను నవగ్రహమందిరంలోకి వెళ్ళి, గిన్నెలోని నూనె పైనుండే దీపంలో వంచి, వత్తి కూడా అందులోనే వేసి వెనక్కి తిరిగాను. ఇంతలో "అత్తయ్యగారండీ! నా గిన్నెలోని నూనె కూడా వంచరూ..." అంటూ, నా చేతికి నూనె గిన్నె అందించింది, నా ప్రక్కనున్న బాలిక. "ఇంత చిన్నపిల్లచేత నూనె గిన్నె యిచ్చి పంపారెందుకబ్బా!" అనుకుంటూ, నూనె గిన్నె అందుకున్నాను నేను. నూనె వంచి ఇచ్చిన గిన్నెను, జాగ్రత్తగా చేతిలోకి తీసుకుంది ఆ పాప. నేను ప్రదక్షిణ మొదలెట్టగానే, నా వెనకే తిరుగుతూ, ఒక్కొక్క ప్రదక్షిణకి, ఒక్కొక్క పైసా చొప్పున మూల గ్రహాలమీద విసిరేయసాగింది. "అమ్మో! పిల్ల చిన్నదయినా, భక్తి లావే...!" విస్తుపోయాను, నేను.

ప్రదక్షిణలు పూర్తిగావించుకొని, విభూతి, కుంకుమలు తీసికొని ఆంజనేయ స్వాములవారి మందిరానికి ముంగిటవున్న ఎత్తైన మంటపంమీద కూచున్నాను. ఆరోజు ఎందుచేతనో, మా పాప-స్వర్ణ-నాతో గుడికి రాలేదు. నేను ఒక్కదాన్నే కూచునివుంటే, ఏమనుకుందో ఏమో - ఆ అమ్మాయి కూడా వచ్చి నా పక్కనే కూచుంది. పాపకి మహావుంటే - పదేండ్లుంటాయేమో! బక్కపల్చగా, తెల్లగా వుంది. ముఖంలో, కళ్ళుమాత్రం కొట్టొచ్చినట్లు పెద్దగా వున్నాయ్. అరచేతిలోని కుంకుమా - విభూతి కలిసిపోకుండా కాగితపు ముక్కలతో అతి జాగ్రత్తగా చిన్నచిన్న పొట్లాలు కట్టింది.

"నీ పేరేంటి పాపా...!" అన్నాను వూరుకోలేక.

"పూర్ణిమ" అంది, అరచేతిలో మిగిలిపోయిన విభూతిని నుదుటికి, పొట్టకి రాసుకుంటూ.

ఆ పిల్లకు, దేవుడిపైగల భక్తి శ్రద్ధలకు - చెప్పద్దూ - నాకు బలే ముచ్చటేసింది.

"ఏం పాపా! నువ్వొక్కతెవే వచ్చావు...? పెద్దవాళ్లెవరూ రాలేదా?" అన్నాను, నేను.

"లేదండీ. అయినా ఎవరొస్తారండీ అత్తయ్యగారూ! నాన్నమ్మకేమో మోకాళ్ళనొప్పి; అమ్మకి ఇంట్లో చేసినంత పని-పైగా ఇంతదూరం నడవగలదాండీ, అమ్మ?"

''ఎక్కడేంటి పాపా, మీ ఇల్లు?''

"క్రిసంట్ పార్క్ స్ట్రీట్ లేదండి... అక్కడ..."

"ఓహో ... మా ఇంటికి వెళ్ళేదారి లోనే అన్నమాట! అక్కడినుండి నువ్వొక్కదానివే వస్తావా...?"

"ఔనండీ. నవగ్రహాలని శ్రద్ధగా చుట్టే-మనం కోరుకున్నవన్నీ జరుగు తాయట కదండీ...! అలా అని మా ఇంటికి వచ్చే శాస్త్రులుగారు చెప్పారు లెండి...'' కళ్ళు ఇంతింతవిచేసి చెప్తున్న ఆ చిన్నారి పూర్ణిమను చూస్తే నాకు ముద్దేసింది.

"అబ్బో...! ఏఁవిటో నీకోరిక...?"

"నా కోరికాండి-! అబ్బే ఏం లేదు లెండి అత్తయ్యగారూ-!" బోల్డు సిగ్గు పడిపోతూ అంది, పూర్ణిమ. కొంపదీసి మంచి మొగుడికోసరం ఇప్పటినుండే దీక్షపూని ప్రదక్షిణములు చేయడంలేదు కదా ఈ పిల్ల! — అనిపించింది నాకు.

ఏమనుకుందో ఏమో - అంతలోకే అందుకొని, "మరేనండి అత్తయ్య గారూ! నాకో చెల్లెలో-తమ్ముడో పుట్టా లని ఇలా దేవుడికి ప్రదక్షిణలు చేస్తున్నా నండీ-" చిక్కటి చిరునవ్వుని జోడించి చెప్తున్న పూర్ణిమ మాటలకు నాహృదయం స్పందించింది. పాపం, తన తరువాత పిల్లలు లేక కాబోలు - ఈ చిన్ని హృదయం తల్లడిల్లుతూంది...!

"నువ్వొక్కదానివేనామ్మా, మీ వాళ్ళకి?" అనవసరపు ప్రశ్నేఅయినా, ప్రసంగం పొడిగించడానికి వేశాను.

"ఔనండీ-"ఛంగున లేచినుంచుంటూ అంది పూర్ణిమ. "వస్తానండి అత్తయ్య గారూ, ఆలస్యమయితే అమ్మ కంగారు పడుతుంది-" వెళ్ళిపోతూ అంది, పూర్ణిమ. అలా వెళుతున్న ఆ అమ్మాయి ముఖంలో ఏదో చెప్పుజాలని అర్థన - దాని వెనుక కన్పించే తృప్తి నాకు గోచరమయ్యాయ్.

అలా మొదలయిన మా పరిచయం దినదినాభివృద్ధి చెందింది. ఒక్కరోజు నేను వెళ్ళడం ఆలస్యమయినా, పూర్ణిమ రావడం ఆలస్యమయినా, ఇద్దరం ఒకరి కోసరం ఒకరం నిరీక్షిస్తూ వుండేవారం.

''ఇక వెళ్దామే అమ్మా...!" అంటూ స్వర్ణ వచ్చి నా ప్రక్కన నిలుచుంది. దాని స్నేహితురాండ్రందరూ వెళ్ళినట్లు న్నారు - ఇక ఇంటి ధ్యాస పట్టుకుంది అమ్మాయిగార్కి. లేవబోతున్న నేను, గబగబా గుడిలోకి వస్తున్న పూర్ణిమను చూసి ఆగిపోయాను. నన్ను చూసి, "అత్తయ్యగారూ! ఒక్క నిముషం వుండండి. ఇప్పుడే వచ్చేస్తాను..." అంటూ, గుడిలోకి పరుగు తీసింది పూర్ణిమ. పూర్ణిమ ఈడుదే అయినా మా స్వర్ణకి గుడిచుట్టడాలు, కుంకుమ విభూ తులు పెట్టుకోవడాలు ఏమీ పట్టవు. ఎంత సేపూ ఆట - లేకుంటే చదువు. ఆట

లాడి విసుగుపుట్టిందేమో - పూర్ణిమ వెంబడి గుడిలోకి వెళ్ళింది స్వర్ణకూడా.

కాస్సేపటికి ఇద్దరూ నా దగ్గరికి వచ్చారు.

"ఏం పూర్ణిమా! ఇంతాలస్యం...?" అన్నాను నా ప్రక్కనే కూచుంటున్న పూర్ణిమను చూస్తూ.

"ఏం లేదండీ అత్తయ్యగారూ! అమ్మకి ఒంట్లో బాగోలేక చాలాసేపు లేవకుండా పడుకుంది. అందుకని..." ఏదో చెప్పలేకపోతున్న ఆ పిల్ల కండ్లలో, నీళ్ళు ఇప్పుడో-అప్పుడో అన్నట్లు తొంగి చూస్తున్నాయ్.

"ఎందుకమ్మా దాపరికం ఈ అత్తయ్యచెంత!" అంటూ ఆప్యాయంగా దగ్గిరికి తీసుకున్నాను, పూర్ణిమని.

అంతే, పూర్ణిమ నా ఒళ్లోపడి వెక్కి-వెక్కి ఏడ్చింది. ఈ హటాత్సంఘటనకి నేను తెల్లబోయాను. స్వర్ణ బిక్కముఖం వేసికొని నా ప్రక్క కూచుంది. కాస్సేపటికి పూర్ణిమ లేచి కూచుని స్కర్టు అంచులతో కళ్ళు తుడుచుకుంది.

"ఏం పాపా! మీ అమ్మకి బాగో లేదా?" అన్నాను. కాదన్నట్లు తల వూపింది పూర్ణిమ. మళ్ళీ ఏమనుకుందో ఏమో, నెమ్మదిగా వెనక్కి తిరిగి, బ్లౌజు ఎత్తి వీపు చూపింది.

ఆశ్చర్యం! తెల్లటి వీపుమీద ఎర్రటి వాతలు!

నాకేం అర్థంకాక, పూర్ణిమకేసి బాధగా చూశాను.


"మరండి - మా నాన్నమ్మ ఈ వుదయం వేడివేడిగా ఏడట్లు వేసిం దండీ అత్తయ్యగారూ! మరీ వేడివి వేసిందేమో - వాతలు పడ్డాయండీ. అది చూసి అమ్మ ఏడ్చింది." పూర్ణిమ ఏడుపుతో సంతోషాణ్ణి జోడిస్తూ నివేదించింది.

"ఎందుకమ్మా ఏడట్లువేయడం...?" తెల్లబోతూ, అడిగాను.

"అయ్యో! నిజంగా మీకు తెలీదాండి అత్తయ్యగారూ! (జాలిగా నాకేసిచూస్తూ) మా అమ్మకి పుట్టిన పిల్లలందరూ పురిట్లోనే చచ్చిపోతున్నారుగా. నా వెన్ను కాలితే అమ్మకి కడుపు చలువయి పిల్లలు బ్రతకొచ్చుగా. అందుకని...!"

"అందుకని - నీ వీపుమీద వాతలా! అయ్యో రామ! మరి, మీ అమ్మా, నాన్నగారూ చూస్తూ వూర్కుండిపోయారా?

"అమ్మ ఏడుస్తూ వద్దంటే వద్దంది. నాన్నగారింట్లో లేరు అయినా, అమ్మ పిచ్చిగాని, ఈ వాతలెంతకాలముంటాయ్ అత్తయ్యగారూ! ఇంతలో మానిపోవూ! ఎంచక్కా తమ్ముడో - చెల్లెలో పుడ్తారుగా. ఆ ఆశతోనే ఈ కష్టాణ్ణి ఆనందంగా అనుభవిస్తాను అత్తయ్యగారూ-" పదేండ్ల అమాయకపు బాలిక అరువదేండ్ల అనుభవాన్ని పుడికి పుచ్చుకుని మాట్లాడుతుంటే, నాకు దుఃఖం ముంచుకొచ్చింది.




"పోన్లేమ్మా! ఇంటికెళ్ళగానే కాస్త కొబ్బరినూనె సున్నపుతేట రాసుకో. అయినా, ఇలా వాతలు వేయించు కుంటారా?" - ఇక అక్కడ కూచోలేక లేచిపోయాను.

ఆ రాత్రి పడుకున్నానేకాని నా ఆలోచనలన్నీ ఆ అమాయకపు బాలిక పూర్ణిమ చుట్టే తచ్చాడుతున్నాయ్. తొలి చూలు పిల్ల తర్వాత, పిల్లలు దక్కక పోతే పెద్ద పిల్ల వెన్ను మంచిదికాదనడం విన్నాను. కానీ, ఇంతలా నమ్మి, ఇంత ఘోరంగ వ్యవహరిస్తారని వూహించలేక పోయాను. కండ్లు అలా మూయగానే ఆ పచ్చటి వీపు, ఎర్రటి వాతలు ప్రత్యక్ష మవసాగాయ్. నిద్రరాక మసలుతూ, ఆ రాత్రే నిశ్చయించుకున్నాను, ఏమైనా సరే, పూర్ణిమ తల్లిని కలిసి మాట్లాడా లని. ఆ నిశ్చయాని కొచ్చాక కాస్త కన్ను మూయగలిగాను.

* * *

"పద పూర్ణిమా! నేను కూడ మీ యింటికి వస్తాను," అన్నాను గుడి బయ టకు వస్తూ.

"నిజంగానేనా అత్తయ్యగారూ! పదండి..." బోల్డు సంతోషపడిపోతూ, నాముందు నడిచింది పూర్ణిమ.

ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ నడక సాగించామ్. పూర్ణిమ ఎంతో హుషారుగా మాట్లాడేస్తుంది. ఆ రోజు మా చంటిది, సుమ, కూడా నాతో వచ్చింది గుడికి. దాన్ని బలవంతంగా నా చేతుల్లోంచి లాక్కుని తను ఎత్తుకుంది పూర్ణిమ. పూర్ణిమ చంక నెక్కి కేరింతలు కొట్ట సాగింది సుమ.

"అత్తయ్యగారూ ! ఈ పాపని రోజూ మా ఇంటికి తీసికెళ్తానండి.'' అంది, మురిపెంగ పూర్ణిమ.

"ఊఁ... అలాగే...'' అన్నాను నేను నవ్వుతూ.

హెన్సుమెన్ రోడ్డు మలుపు తిరిగి, క్రెసంట్ పార్క్ స్ట్రీటువేపు దారి తీసింది పూర్ణిమ. ఒక పెద్ద ఇంటిముందు ఆగి, గేటు తెరిచి, "రండి అత్తయ్యగారూ -'' అంది పూర్ణిమ, క్రిందికి జారిపోతున్న సుమని, మళ్ళీ చంకలోకి లాక్కొంటూ. ఏడ్పుకి సిద్ధమవుతున్న సుమని, పూర్ణిమ వద్దనుండి అందుకొని, "పెద్ద ఇల్లేనే" అనుకుంటూ, పూర్ణిమని అనుసరించాను. కాని పూర్ణిమ తిన్నగా వెళ్ళక ప్రక్కకి దారితీసింది. ఓహో... ఔట్ హౌసులో నన్నమాట వీళ్ళుండేది. త్యాగరాయనగర్‌లో కొందరు భాగ్యవంతులు, వారి భవంతుల వెనుకవేపు చిన్న చిన్న గదులు కట్టించి, అద్దెకు ఇస్తుంటారు. ఇలా చేయడంవల్ల ఇంటిగల వాళ్ళకి కాస్త మాట సాయం, మరి కొంత ఆర్థిక సాయం.

మూడు గదులున్న చిన్న పోర్షన్ లోకి, రివ్వున దూసుకుపోయింది పూర్ణిమ. "అమ్మా ! కోవెల అత్తయ్యగారంటూవుంటానే ఆ అత్తయ్యగారొచ్చారమ్మా - నిన్ను చూడ్డానికి...''పూర్ణిమ మాటలు విని, ఓ ముప్పై సంవత్సరాలున్న స్త్రీ బయటకువచ్చింది. "రండి... రండి" అంటూ, నన్నాహ్వానిస్తున్న పూర్ణిమ తల్లికేసి చూశాను. బహుశా ఆవిడకి ముప్పై ఏండ్లు కూడా వుండవేమో అనిపించింది. అచ్చుగ్రుద్దినట్లు పూర్ణిమనే పోలివుంది. నీరసంగావున్న ఆవిడ గర్భవతి అని గ్రహించాను. పూర్ణిమ గబగబా రెండు మోడాలు తెచ్చి వరండాలో వేసింది. ఇద్దరం కూచున్నాము

"మీ పాప పూర్ణిమకి భలే దైవభక్తండీ ! క్రమం తప్పకుండా గుడికి వస్తుంది." అంటూ నవ్వుతూ నా ప్రసంగాన్ని ప్రారంభించాను. తల్లి చెవిలో ఏదో గుసగుసలు పోతోంది, పూర్ణిమ. ఆవిడ నవ్వుతూ, "చూడండి, మా పాపకి మీ పాప బాగుందట. అలాంటి పాప కావాలనే తను గుడికి వెళ్తూందిట..." చెబుతూ చెబుతూనే ఆవిడ ముఖం వెలవెల పోవడం గమనించాను. మంచినీళ్ళకై పేచీపెట్టున్న సుమని పూర్ణిమకి అప్పచెప్పాను.

''ఏమండీ ! మీ పేరు నాకు తెలియదు. మిమ్మల్ని చూడ్డం కూడా ఇదే ప్రథమం. కానీ, పూర్ణిమతో కొన్ని నెలలుగా నాకున్న పరిచయాన్ని ఆధారం చేసుకొని, మీరు నాకు చాలా ఆప్తులన్న భావనతో మిమ్మల్నొకటి అడుగదలచాను..." అన్నాను

"ముఖంలో కాస్త ఆశ్చర్యం కనబరుస్తూ, ''తప్పక...'' అన్నట్లు తల తిప్పి నా వంక చూసింది.

"పాపం చిన్నపిల్ల కదా, అంతలా వాతలు పెట్టారెందుకండీ పూర్ణిమ వీపు మీద...!"

నా మాటలు పూర్తికాకమునుపే, ఆవిడ నయనాలు అశ్రుపూరితము లయ్యాయ్. మాటలు రాక, కన్నీటిని పైట కొంగుతో తుడిచేసుకొంటున్న పూర్ణిమ అమ్మని, మళ్ళీ నేనే పలుక రించాను.

"క్షమించండి. మీ పాప వీపుమీది వాతల్ని గుర్తుచేసి మిమ్మల్ని బాధపెట్టి నట్లున్నాను. పోనీలెండి, ఇంతకూ మీ పేరు తెలుసుకోవచ్చునా?"

"కృష్ణవేణి."

'నా పేరు లక్ష్మి'_మా వారి ఉద్యోగం మేముంటున్న ఇల్లు, వీధి, ఇత్యాది వివ రాలన్నీ ఎరుకపరిచాను కృష్ణవేణికి.

కొద్దిగా కోలుకున్న కృష్ణవేణి మాట్లాడసాగింది. "కొద్ది దినాల సాన్ని హిత్యానికే మా పాప పట్ల, మీకంత బాధగావుంది కదా, ఇక కన్నతల్లిని నా కెంత ఆవేదన వుంటుందో వూహించండి అక్కయ్యగారూ! ఏమని చెప్పను...? ప్రతి తడవా నాకు గర్భం రావడం, ఎన లేని ఆశలు పెంచుకోవడం, మా ఆశా పాశాలకు గ్రొడ్డలివేటులా, పుట్టిన శిశువు పురిటిలోనే మరణించడం అలవాటై పోయింది. మా పెండ్లయిన సంవత్స రానికే పుట్టిన ఈ పూర్ణిమని చూడండి. చక్కగా, ఆరోగ్యంగ వుంది. తర్వాత పుట్టిన ఇద్దరు పిల్లలూ - ఇద్దరూ మగ పిల్లలే - పుట్టీపుట్టగానే కన్నుమూసారు. ఏటేటా శిశువును మోయడం నా వంతు- అపనిందను మోయడం నా కన్నకూతురు వంతు అవుతున్నది. పూర్ణిమ వెన్ను మంచిది కాదంటుంది మా అత్తయ్య. నష్టజాతకురాలంటూ తిట్టిపోస్తారు, మా మామగారు చూశారుగా నిన్న; పసిదన్న దయాదాక్షిణ్యం లేకుండా పూర్ణిమ వెన్ను మీద ఎంతలా వాతలు పెట్టారో!-" పెల్లుబుకి వస్తున్న దుఃఖాణ్ణి ఆపుకోలేక పోయింది కృష్ణవేణి

ఈ మూర్ఖపు ముసలమ్మల అర్థంలేని మూఢనమ్మకాలకి - చెప్పొద్దూ - నాకు ఒళ్ళు మండుకొచ్చింది. వీళ్ళసలు సరిగ్గా డాక్టరుకి చూపించారో లేదో...? అదే ముక్క కృష్ణవేణితో అన్నాను.

"అదేం లేదండీ. చూపిస్తూనే వున్నాం ప్రతి తడవ. మా తల్లిగారి వూరు కాళహస్తికి దగ్గరగా వున్న వెంకటాపురం. బస్తీకాకపోయినా, పెద్ద పల్లెటూరే ఆ వూర్లో కాన్పులెన్నో చేసి అనుభవం గడించిన నర్సమ్మ కూడా వుంది. అయినా, పెద్దపిల్ల అక్కడేగా పుట్టింది. మరొక్క విషయం. నావి చాలా సులభమైన కాన్పులు..."

"కాన్పు సులభమైనంత మాత్రాన పిల్లలు ఆరోగ్యంగా పుట్టారని ఎక్క డుందండీ? అయినా, రెండు తడవలు

అలా జరిగాక మీరు కాస్త జాగ్రత్త పడాలి'' అన్నాను

"అందుకేనండీ ఈ మారు మద్రాసు లోనే పురుడు పోసుకుంటాను," అంది, కృష్ణవేణి.

''అయితే ఇకనేం, మీరు ధైర్యంగా వుండొచ్చు. ఈ మారు పూర్ణిమ ఓ 'అక్క' అవడం ఖాయం. చీకటి పడు తోంది ఇక వెళ్ళివస్తానండి. పూర్ణిమను తోడుతీసుకొని మా ఇంటికోమారు రండి..."

''అలాగే...తప్పక వస్తాను...''

సుమని తీసికొని, ఇంటిదారి పట్టాను నేను. నీలకంఠ మెహతా స్ట్రీటులోవుండే మా ఇల్లు, పూర్ణిమ వాళ్ళ ఇంటికి చాలా దగ్గర. పది నిముషాల్లో ఇల్లు చేరుకు న్నాను.

గుడినుండి అప్పుడప్పుడు పూర్ణిమ వాళ్ళింటికి వెళ్ళి కృష్ణవేణి ఆరోగ్య సమాచారాలు కనుక్కుంటూ వుండే దాన్ని. అలా వెళ్తున్న నాకోమారు, పూర్ణిమ నాయనమ్మను చూచే భాగ్యం కూడా కల్గింది. ఆవిడ, పూర్ణిమ కనబడితే చాలు కళ్ళల్లో నిప్పులు పోసుకునేది. సుమని ఎత్తుకు తిరుగుతున్న పూర్ణిమని చూసి "అంతేలే...! ఈ దరిద్రపుగొట్టు ముఖానికి పరాయి పిల్లల్ని ఎత్తి మోసే భాగ్యమేలే-" అంటూ ఈసడించుకొనేది. వాళ్ళ నాయనమ్మని తప్పించుక తిరిగే, పూర్ణిమ ఖిన్నవదనాన్ని చూసినపుడల్లా, నాకు భరించరాని బాధ కల్గేది

ఆ రోజున, సుమని పొరపాటున క్రింద పడవేసిన రోజున, ముసలమ్మ మరీ గొడవచేసింది. "నీ స్వంత తమ్ము ళ్ళను పొట్టన పెట్టుకుంది చాలక, పరా యమ్మ కన్నబిడ్డల నెందుకే ఎత్తి కుదే స్తావ్!" అంటూ టక్కుటక్కున ఆ పిల్ల నెత్తిమీద మొట్టికాయల వర్షం కురిపిం చింది. కృష్ణవేణి గ్రుడ్ల నీరు కక్కు కుంటూ పూర్ణిమని దగ్గరికి తీసుకుంది. ఊర్కుండలేక నేనే, "అదేంటి మామ్మ గారూ! పిల్లలెపుడూ క్రింద పడ రా యేంటి...? పూర్ణిమను ఏమీ అనకండి." అంటూ సర్దిచెప్పాను. పువ్వుల్లాంటి పసి పాపల లేత మనస్సులను ఈ పెద్దవారు ఎంత నిర్దాక్షిణ్యంగ నలిపివేస్తారో!

పూర్ణిమవాళ్ళ కుటుంబంతో నాకు స్నేహం ఎంత పెరిగిపోయిందంటే, కృష్ణవేణి కాన్పు విషయంలో చెప్ప లేనంత శ్రద్ధ తీసికోవడం మొదలెట్టాను. పూర్ణిమకి ఎలాగయినా సరే, ఈ మారు ఓ చెల్లో - తమ్ముడో దక్కేటట్లు చేయాలి. 'అత్తయ్యగారూ! ఇదుగోండి నా చిన్నారి చెల్లి!' అంటూ, తన చిట్టి చెల్లెల్ని నాకు చూపిస్తున్నప్పుడు ఆ పిల్ల సుందర వదనంలోని మందహాస వీచిక లను చూచి ఆనందించాలి.

కృష్ణవేణ్నినీ ఎగ్మూర్ హాస్పిటల్లో చేర్పిస్తే మంచిదేమో అనిపించింది నాకు.



ఎంచేతనంటే, అక్కడ పీడియాట్రీషియన్‌గా పనిచేసే డాక్టర్ కరుణాకర్, మా వారికి బాగా తెలిసినవారు. ఈ మాటే మా వారి చెవిలో వూదాను.

"ఓ...దానికేం... వాడికి చెబుతా కానీ, మీ స్నేహితురాలి వివరాలన్నీ ఇవ్వు మరి..." అన్నారు, మా వారు.

రోజులు దొర్లుతున్నాయ్. గుడిలో కానీ, వీధిలో కానీ చిన్నపిల్లలు కంట బడితే చాలు, వారిని ఆబగ చూసేది పూర్ణిమ. నేనది గమనిస్తూ, "ఇంకెన్నాళ్ళులే...నీకూ ఓ చెల్లాయి వస్తుంది. అప్పుడు ఈ అత్తయ్యని మరిచిపోతావు కదూ...!" ఉడికిస్తూ, అనేదాన్ని. "పోండి అత్తయ్యగారూ...!" అనే దా అమ్మాయి, నవ్వుతూ.

* * *

నా గుడి చుట్టడాలు పూర్తయ్యాయ్. గుడికి వెళ్ళడమైతే మానేశాను కాని, కృష్ణవేణీ వాళ్ళ ఇంటికి నాలుగైదు రోజుల కొకమారైనా వెళ్ళకపోతే తోచేది కాదు. ఆ రోజు వుదయం అలవాటుగా

వాళ్ళింటికి బయలుదేరాను. వాకిట్లో నిల బడి, బిక్కు బిక్కుమంటూ ఏదో ఆలో చిస్తోంది పూర్ణిమ. ఆ పిల్లను చూడగానే, "అమ్మ ఏదమ్మా ?" అన్నాను.

"అమ్మని ఇందాకనే హాస్పిటల్‌కి తీసి కెళ్ళారండి అత్తయ్యగారూ," అంది, భయం భయంగా.

"మరి, నాయనమ్మ ఎక్కడ ?"

"గుడి కెళ్ళిందండీ - అర్చన చేయిం చుక రావడానికి..."

"నా దంతా దురదృష్ట జాతకమట అత్తయ్యగారూ. అందుకని నాయనమ్మ నన్ను వద్దంది. నాకు భయంగా వుందండి అత్తయ్యగారూ. అమ్మకి ఈ తడవ పుట్టిన పాప బ్రతకాలి. లేకుంటే నన్ను మా నాయనమ్మ చంపేస్తుందటండీ..." బావురుమంటూన్న పూర్ణిమని, ఒళ్లోకి తీసికొన్నాను.


"ఊర్కో - ఏడవకమ్మా. పాప ఎందుకు చచ్చిపోతుంది ? ఈ మారు అలా జరుగదు. మునుపంటే మీ మామయ్యగారి వూర్లో వైద్యసదుపా యాలు లేక, పుట్టిన ఇద్దరు పిల్లలు చచ్చి పోయారు. ఇప్పుడలా ఎందుకు జరుగు తుంది...? నీకేం భయం లేదులే. నేను వచ్చి వెళ్ళానని మీ నాయనమ్మతో చెప్పు..." పూర్ణిమని ఓదార్చి, ఇంటి ముఖం పట్టాను.

మా వారు ఆఫీసుకు వెళ్ళేందుకు తయారై, నా కోసరం చూస్తున్నట్లు న్నారు. ఆదరాబాదరగా వచ్చిన నన్ను చూసి, "ఏంటోయ్ అదోలా వున్నావ్..? మీ స్నేహితురాలి కేమయింది ?" అన్నారు

'కృష్ణవేణిని ఈ వుదయమే హాస్పి టల్‌కి తీసుకువెళ్ళారుట.. ఈ దినమే కాన్పు కావచ్చునేమో !" అన్నాను.

"ఈజ్ ఇట్...?" ఏం ఫరవాలేదు లక్ష్మి. డాక్టర్ కరుణాకర్ మీ స్నేహితు రాల్ని ఇదివరకే పరీక్షించాడట నేను ఆఫీసుకి వెళ్ళగానే మళ్ళీ ఓమారు ఫోన్ చేసి కనుక్కుంటాలే. నీ పనీ - అదీ ముగించుకొని హాస్పిటల్‌కి ఓమారు వెళ్ళి రాకూడదూ...! సో...ఐ షెల్ గో..." బయటకు నడిచారు, మా వారు

వంట ముగించుకొని, పక్కింటివారికి సుమని అప్పచెప్పి, హాస్పిటల్‌కి ప్రయాణ మయ్యాను నేను. ఆటో చిక్కడం ఎలా కష్టం కాలేదో - ఎగ్మోర్ హాస్పిటల్ లోని ప్రసూతివార్డు కనుక్కోవడం కూడా, అట్టే కష్టంకాలేదు నాకు. ప్రసూతివార్డులోని ప్రతి మంచం ప్రక్కన ఓ ఊయల. నిదురోతున్న శిశువులు కొందరు ఊరకనే ఏడుస్తున్న పిల్లలు మరికొందరు. అందర్నీ చూచు కుంటూ కృష్ణవేణి పడుకొనివున్న పక్క కేసి నడిచాను. కృష్ణవేణి మగతగా అటు తిరిగి పడుకొనివుంది ప్రక్కనే వున్న ఉయ్యాలలోకి ఆత్రంగా చూశాను ఖాళీ తొట్టి నన్ను వెక్కిరించినట్లనిపించింది.




నివ్వెరపోయాను. గుండె ఒక్క మారు ఆగిపోయిన ట్లనిపించింది. తమాయించుకొని ప్రక్కకి తిరిగాను. ప్రక్క పడకలోని బాలెంతరాలు నా వివర్ణ వదనాన్ని గమనించి, నవ్వుతూ ''బేబీ కోసరం చూస్తున్నారా...? ప్రసవమై నప్పటినుండి బేబీని బయటకు తేనే లేదండి. అదేదో రక్తం ఇస్తున్నారుట" అంది.

ఇంతలో సుడిగాలిలా దూసుకు వచ్చింది పూర్ణిమ. "అత్తయ్యగారూ, నాకు తమ్ముడు-బుల్లి తమ్ముడు పుట్టా డట! అంతేకాదు అత్తయ్యగారూ, నా తమ్ముడికి ఇకనేం ప్రమాదం లేదట - ఇందాకనే డాక్టరుగారు మా నాయ నమ్మతో చెప్పారు...'' నన్ను గట్టిగా వాటేసుకుంటూ, అంది పూర్ణిమ.

పూర్ణిమ ముఖంలో, తొలిసారిగా, పూర్ణిమ వెన్నెలలు గాంచిన నా కళ్ళు ఆనందబాష్పాలతో నిండాయి.

"మీ నాయనమ్మగా రెక్కడ...?'' అన్నాను.

''ఇందాకనే ఇంటికెళ్ళింది. మళ్ళీ ఓ గంటలో వస్తానంది.''

మగతగా నిదరోతున్న కృష్ణవేణిని లేప మనస్కరించలేదు. ఆనందంతో నిండిన హృదయంతో - ''పూర్ణిమా, అమ్మ లేచాక నేనొచ్చి వెళ్ళానని చెప్పు..." అంటూ, ప్రసూతివార్డు నుంచి బయటకు నడిచాను.

ఆ సాయంత్రం ఇంటిపనులు ముగించుకొని, శ్రీవారికై ఎదురుచూస్తూ కూచున్నాను. మా ఇంట్లో ఏదో శుభం జరిగినంత సంబరంగా వుంది నాకు. మా

వారువచ్చిందే, పూర్ణిమకి తమ్ముడు పుట్టాడన్న శుభవార్తని వారి చెవిలో వెయ్యాలి...

నిరీక్షిస్తున్న శ్రీవారు రానే వచ్చారు. వాకిట్లోంచే, ''కంగ్రాచ్యులేషన్స్... పూర్ణిమకి తమ్ముడు పుట్టాడు ... ఆరోగ్యంగా వున్నాట్ట...'' అంటూ వచ్చారు.

''నేనే ఆ శుభవార్తను మీ చెవిలో వేద్దామని వువ్విళ్ళూరుతుంటే... మీరే చెప్పేశారే...'' నవ్వుతూ, అన్నాను.

''ఇందాక డాక్టర్ కరుణాకర్ క్లబ్బులో కలిసాడు...'' టై లూస్ చేసి కుంటూ, సోఫాలో చేరగిలబడి అన్నారు, శ్రీవారు.

బ్రూ కాఫీ సేవిస్తున్న శ్రీవారికేసి చూస్తూ అన్నాను. ''ఇంతకీ కృష్ణవేణిది కాదండి అదృష్టం; పూర్ణిమదే! పాపం, ఆ పిల్ల తమ్ముడికోసరం ఎంత పాటు పడ్డది! అయినా మన ఛాదస్తాలంటూ అంతలా తీసిపారేస్తాముకదా! వెన్నుచలవకి ఏడట్లు వేసిందని వాళ్ళ నాయనమ్మని ఎంతగానో తిట్టుకున్నాను. కానీ, ఇప్పుడనిపిస్తోంది - పూర్ణిమ నిజంగా దురదృష్ట జాత ఎందుకు కాకూడదా - అని. పుట్టిన బిడ్డ లక్షణంగా వున్నాడంటే ఏడట్ల ప్రభావమే కాకూడదా!?...''

మాటల మధ్యలో ఉలిక్కిపడ్డట్లు నావేపు చూసి, మా వారు పక పకా నవ్వడం మొదలెట్టారు.

"అన్నీ చెప్పవేం లక్ష్మీ...! పూర్ణిమ, నవగ్రహాల చుట్టిన పుణ్యమే కావచ్చు, వేయించుకున్న వాతల ప్రభావమే కావచ్చు-లేక-వాళ్ళ నాయనమ్మ శాస్త్రుల వారిని పిలిపించి-చేయించిన 'శాంతి'యే కారణం కావచ్చు... ఇంకేదో కావచ్చు. కానీ, అసలు కారణం తెలిస్తే నీవు నిర్ఘాంతపోతావ్...! అదేవిటో తెలుసా? పుట్టిన బిడ్డ బ్రతకడానికి కారణం నీవే...!"

"ఏవిటి...! నేనా...!!"

"ఊఁ...నువ్వు పట్టుబట్టబట్టి ఈ కేసు కరుణాకర్ చేబట్టాడు. అతని హస్తవాసి వల్లే ఈ బిడ్డడు బ్రతికాడు! కృష్ణవేణికి పుట్టిన బిడ్డ 'రీసెస్ బేబీ' అట-"

"అంటే!" అన్నాను, ఏమీ అర్థమవక.

"నా ఇంజనీరింగ్ బుర్రకే పూర్తిగా అర్థం కాలేదు. మరి నీ లిటరేచర్ బుర్రకి ఎలా అర్థమై చస్తుందిలే..."

"అబ్బ విసిగించక వివరాలు చెబుదురూ!"

"అంత ఓపికా - నాలెడ్జి నా కెక్కడున్నాయ్ — అదో ఆ టీపాయ్ మీద ఇందాక కరుణాకర్ ఇచ్చిన సైన్స్ జర్నల్ పడేశాను. అందులో పదమూడవ పేజీ తెరిచి చదువు..." ఆర్డర్ జారీచేసి లోనికి జారుకున్నారు శ్రీవారు.

ఆదరాబాదరాగా టీపాయ్ మీదున్న సైన్స్ జర్నల్ తెరిచి పదమూడవ పుట లోని వ్యాసాన్ని చదవడం మొదలె ట్టాను.

"రీసెస్ శిశువులు (Rhesus babies).

* * *

పుట్టబోయే శిశువుల్ని రీసెస్ ప్రమాదంనుంచి తప్పించే వైద్య పద్ధతులు, ఆధునిక వైద్యవిజ్ఞానంవల్ల మన కిప్పుడు లభ్యమవుతున్నాయి. తల్లి యొక్క రక్తాణువులు, పుట్టబోయే శిశువు యొక్క ఎర్ర రక్తాణువులను విరిచివేసే కారణంగా, శిశువు కామెర్లతో జన్మించడమో, మృత శిశువుగా పుట్టడమో జరుగుతుంటుంది. ఈలాంటి శిశువులను రీసెస్ శిశువులని, ఈ వ్యాధిని 'హేమోలిటిక్ ఎనీమియా' (Haemolytic anaemia) అని, అంటారు.

భార్యా భర్తల రక్తంలోగల, రక్త-వైరుధ్యం ఇందుకు కారణం. మానవ రక్తాన్ని అనేకరకాలుగా విభజింపవచ్చును. ఉదాహరణకు ఏ బి ఓ (ABO) సిస్టమ్ తీసుకొందాం. 'ఓ' గ్రూపు రక్తం గలవారికి 'ఏ', లేక 'బి' లేక 'ఏ బి' రక్తపు గ్రూపులు పనికిరావు. ఎందుచేత నంటే, 'ఓ' గ్రూపు రక్తం గలవారిలో 'ఏంటిబాడీస్' (Anti bodies) అనబడే సూక్ష్మ రేణువులు వుంటాయి. ఇవి, దానంగా గ్రహింపబడ్డ విరుద్ధ రక్తంలోని కణములకు అతుక్కొని వాటిని హరింప జేస్తాయి.

మానవకోటిలో నూటికి ఎనభై ఐదు మంది రక్తంలో రీసెస్ అనబడే సూక్ష్మ రేణువులు వుంటాయి. వీళ్ళందరిని రీసెస్ పాజిటివ్ (Rh+) వ్యక్తులంటూ వ్యవహరిస్తాము. రక్తంలో రీసెస్ సూక్ష్మరేణువులు లేని వ్యక్తుల్ని రీసెస్ నెగెటివ్ (Rh –) వ్యక్తులుగా వ్యవహరిస్తాము. ఆర్. హెచ్. పాజిటివ్ వ్యక్తి యొక్క రక్తాన్ని, ఆర్. హెచ్. నెగెటివ్ వ్యక్తికి ఇచ్చామనుకుందాము. రెండవ వ్యక్తి రక్తం ఏంటిబాడీస్‌ని తయారుచేస్తుంది. ఈ తయారైన నిరోధం రేణువులు, ఆర్. హెచ్. పాజిటివ్ రక్తకణాల్ని నాశనం చేస్తాయి.

సర్వసాధారణంగా ఆర్. హెచ్. నెగెటివ్ స్త్రీ, ఆర్. హెచ్. పాజిటివ్ శిశువును పొంది వుంటుంది. శిశువు జననమొందే సమయంలో శిశువుయొక్క ఆర్. హెచ్. పాజిటివ్ రక్తం, ఏ కొద్దిగానైనా తల్లి యొక్క రక్తప్రసరణలోకి జారుకుంటుంది. తత్కారణముగా, తల్లియొక్క ఆర్. హెచ్. నెగెటివ్, రక్తం, శిశువు నుండి పొందిన ఆర్. హెచ్. పాజిటివ్ రక్తానికి విరుద్ధంగా, ఏంటిబాడీస్‌ని తయారుచేస్తుంది. తల్లిలో, ఈ నిరోధక రేణువులు తయారవ్వకముందే ప్రథమ శిశువు జన్మించడము వలన, ఆ శిశువుకు

ఏంటిబాడీస్ వలన ప్రమాదము లేదు కానీ, తరువాత పుట్టబోయే శిశువులకు, వాటివలన ఎంతేని ప్రమాదంవుంది. ప్రథమ సంతానం తరువాత తల్లిరక్తంలో అత్యధికంగా విస్తరిల్లి, రక్తంయొక్క పసుపురంగు ద్రవపదార్థంలో(ప్లాస్మాలో) విలీనమై, బిడ్డపిండంలో ప్రవేశించి, బిడ్డయొక్క అర్.హెచ్. పాజిటివ్ రక్తకణాల్ని నాశనం చేస్తాయి. ఈ రక్తక్షీణత కారణంగా, పుట్టినపుడు నార్మల్‌గా కనిపించే శిశువు, పుట్టిన కొద్దికాలానికే విపరీతమైన కామెర్ల వ్యాధికి గురియై అకాల మరణం చెందుతుంది. బిడ్డ పుట్టిన వెంటనే, బిడ్డలోని క్షీణరక్తపు స్థానే అర్.హెచ్.నెగెటివ్ రక్తాన్ని మార్పిడిచేయడం వలన, ఆ బిడ్డను బ్రతికించవచ్చును.

భార్యాభర్తల మధ్య ఈలాంటి రక్తవైరుధ్యం వున్న కారణంగా పై ప్రమాదాలు సంభవిస్తాయి. కాన్పులు దగ్గిర దగ్గిరగా ఏర్పడ్డకొద్దీ, ఈ రక్తవైరుధ్యం అధికమవుతుంది. కాన్పులు దూరమయ్యే కొద్దీ వైరుధ్యం తగ్గిపోతుంది.

ఏది ఏమైనా, గర్భిణీ స్త్రీలందరూ తప్పనిసరిగా ఆచరించవలసిన పని ఒకటుంది. అది వారి రక్తంలోని రీసెస్+ గ్రూపింగ్ తేల్చుకునేందుకు డాక్టర్లచేత పరీక్షచేయించుకోవడమే. నూటికి పదిహేనుమంది స్త్రీలు అర్.హెచ్. నెగెటివ్ రక్తాన్ని పొందివుంటారు. అలాంటి స్త్రీలకి తొలి కాన్పు తర్వాత ఏంటి-డి Anti-D) అన్న ఇంజెక్షన్ ఇచ్చి మలి కాన్పుల శిశువులను మరణం పాలు కాకుండా కాపాడవచ్చును.........”

* * *

అర్థమైపోయింది. కృష్ణవేణికి పూర్ణిమ తరువాత పుట్టిన ఇద్దరు మగపిల్లలూ దక్కకుండా పోవడంలోని కీలకం తెలిసిపోయింది నాకు.

చిన్నారి పూర్ణిమ తానుచేయని దురదృష్ట జాతగా ఆఖడి పాలైంది. అందుకే ఆ పసిదానిపై నాకు ఎనలేని ప్రేమాభిమానాలు - సానుభూతీ.

ఆఖరుకి తానో అందాల తమ్మునికి పూర్వజగా నిలిచి, అందరి మెప్పులు పొందింది.

